# ప్రజాపక్షం జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

సోమవారం | 17 జూన్, 2024 | పేజీలు : 04


## కలెక్టర్‌గా సత్యప్రసాద్ బాధ్యత స్వీకరణ



**ప్రజాపక్షం/జగిత్యాల జిల్లా ప్రతినిధి :** జగిత్యాల జిల్లా నూతన కలెక్టర్ గా ఆదివారం రోజున శ్రీ బి.సత్యప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో కలెక్టర్ల బదిలీల నేపథ్యంలో షేక్ యాస్మిన్ బాషా ను బదిలీ చేస్తూ, ఆమె స్థానంలో బి. సత్య ప్రసాద్ ను ప్రభుత్వం నియమించింది. ఆదివారం కలెక్టరేట్ లో బదిలీ పై వెళ్తున్న షేక్ యాస్మిన్ బాషా నుండి నూతన కలెక్టర్ బాధ్యతలను స్వీకరించారు. అనంతరం వివిధ శాఖాల అధికారులు, సిబ్బంది కొత్త కలెక్టర్ కు పూల మొక్కలను అందించి శుభాకాంక్షలు అందజేశారు.

*** కలెక్టర్, ఎస్పీ ల బదిలీలు అని ముందే ఊహించిన ప్రజాపక్షం జాతీయ దినపత్రిక***

జగిత్యాల జిల్లాలో ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధం అనే వార్త లో జిల్లా కలెక్టర్ బదిలీ తప్పదనే వార్త శనివారం ప్రజాపక్షం లో ప్రచురితమైంది. వార్తకు అనుగుణంగానే జగిత్యాల జిల్లా కలెక్టర్ షేక్ యాష్మీన్ బాషా బదిలీ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం 20 మంది ఐఏఎస్ లను బదిలీ చేయగా అందులో జగిత్యాల కలెక్టర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. జగిత్యాల జిల్లా కలెక్టర్ గా ఖమ్మంలోస్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ పనిచేస్తున్న బుధు మజ్జి సత్య ప్రసాద్ పదోన్నతి పై జగిత్యాల లో నియామకం అయ్యారు.

## ప్రజాసమస్యలపై మంత్రి పొన్నం ప్రజాదర్బార్



**ప్రజాపక్షం/చిగురుమామిడి :** చిగురుమామిడి మండల కేంద్రంలో రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి ప్రజా సమస్యలపై ప్రజాదర్బార్ నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను విని సంబంధిత శాఖల అధికారులతో నేరుగా మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. ప్రజలతో సాదాసీదాగా పలు అంశాలపై ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, మంత్రిగా రెట్టింపు బాధ్యతతో హుస్నాబాద్ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. మంత్రి చొరవ, పనితీరుతో మండల ప్రజలు హర్షం వెలిబుచ్చారు. కార్యక్రమంలో స్థానిక జడ్పిటిసి గీకురు రవీందర్, మండల పార్టీ అధ్యక్షుడు కంది తిరుపతి రెడ్డి, చిట్టుమల్ల రవీందర్, డిసిసి అధికార ప్రతినిధి ప్రవీణ్ కుమార్, గందె రాజయ్య తదితరులున్నారు.

## గోవుల తరలింపును అడ్డుకున్న మహిళా మణులు

### అభినందించిన గ్రామ మాజీ సర్పంచ్ సంపత్ రావు



**ప్రజాపక్షం/ముత్తారం :** అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా బక్రీద్ పండుగ సందర్భంగా ఓ ప్రైవేట్ వాహనంలో హైదరాబాదులోని మల్కాపేట్ పరిధిలో మూగజీవాలను జీవహింస కోసం తరలిస్తున్న ఓ వాహనాన్ని ముత్తారం మండలం ఓ గ్రామానికి చెందిన మహిళలు హైదరాబాదు లోని మల్కపేట్ ప్రధాన రహదారిపై అడ్డుకున్నారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ మహిళలు ఆవులను తరలిస్తున్న వారిపై ఫిర్యాదు చేశారు. ఇద్దరు మహిళా మహారాణులు ధైర్య సహసాలతో ఆవులను తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకొని అరగంటపాటు అడ్డుకొని తమ ధైర్యాన్ని చాటుకున్నారు.ఆవులు, ఆవుదూడలతో వస్తున్న ఓ వాహనాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా హరిపురం మాజీ సర్పంచ్ సంపత్ రావు గ్రామానికి చెందిన మహిళలను అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ చట్ట విరుద్ధంగా ఆవులను జీవహింస చేస్తున్న వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవడం లేదని అలాంటి వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అన్నారు. అక్రమంగా ఆవులను తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసి సంబంధితులపై కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు.

## బాధ్యతలు స్వీకరించిన సందీప్ కుమార్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** కలెక్టర్ గా సందీప్ కుమార్ ఝా ఆదివారం ఉద్యోగ బాధ్యతలు ఆదివారం స్వీకరించారు. అంతకు ముందు ఆయన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దర్శనానికి వెళ్ళగా, అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యా నాయక్, ఆలయ ఇంచార్జీ ఈఓ రామకృష్ణ పుష్ప గుచ్చం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయగా, అర్చకులు ఆయనను ఆశీర్వదించారు. అక్కడి నుంచి కలెక్టర్ నేరుగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్ కు చేరుకొని బాధ్యతలు స్వీకరించగా, అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యా నాయక్ పుష్ప గుచ్చం అందజేశారు. ఆయా శాఖల ఉన్నతాధికారులు కలెక్టర్ ను కలిసి పూల మొక్కలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజలు సోషల్ మీడియాలో వచ్చే వదంతులను, రూమర్స్‌ను నమ్మరాదు

### ఎస్పి అఖిక్ మహాజన్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడారు.. అన్ని మతాలకు చెందిన ప్రజలు సోదర భావంతో, శాంతియుత వాతావరణంలో పండుగలను జరుపుకుంటూ, మత సామరస్యానికి ప్రతీకగా నిలవాలన్నారు. సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు, ఇతరుల మనోభావాలు దెబ్బతినే విధంగా అభ్యంతరకర పోస్టులు వచ్చిన ప్రజలు అట్టి పోస్టులను చూసిన వెంటనే ప్రతిస్పందించకుండా, సంయమనం పాటిస్తు అట్టి పోస్టుల్లో నిజానిజాలను తెలుసుకునే ప్రయత్నం చేయాలని,సామాజిక మాధ్యమంల్లో వచ్చే వదంతులను నమ్మవద్దని వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

## బక్రీద్ పండుగకు భారీ బందోబస్తు

### మతసామరస్యాన్ని కాపాడుతూ పండుగను శాంతియుతంగా నిర్వహించుకోవాలి.. కనుక అన్ని వర్గాల ప్రజలు, మత పెద్దలు సహకరించాలి

### ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా ఎస్పి జి జానకి షర్మిల



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** బక్రీద్ పండుగకు బయటి జిల్లాల నుండి ఫోర్స్ ఈ రోజు రావటం జరిగింది.నిర్మల్ జిల్లా పోలీసు సిబ్బంది.ఇతర జిల్లాల పోలీసు సిబ్బంది. తో పటిష్ట బందోమస్తు ఏర్పాటు చేయటం .జరిగింది.ఇట్టి బందోబస్తు ను జిల్లా ఎస్పీ స్వయంగా అదివారం రోజు దిశానిర్దేశం చేయుట జరిగింది.జిల్లా ప్రజలకు రేపటి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేసారు.బక్రీద్ పండుగను జిల్లా ప్రజలు మత సామరస్యాన్ని కాపాడుతూ ప్రశాంతంగా నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా లో ఎవరైనా అటువంటి అవాంఛనీయ సంఘటనలు సృష్టించిన లేదా ప్రేరేపించిన వారి పైన కఠినమైన చర్యలు తీసుకోవటం జరుగును అని ఎస్పీ హెచ్చరించారు.జిల్లా వ్యాప్తంగా గత పది రోజులుగా అంతరాష్ట్ర అంతర జిల్లా చెక్పోస్టులను ఏర్పాటు చేసి ప్రతి చెక్ పోస్ట్ నందు సిబ్బంది తో 24 గంటలు వాహనా తనిఖీలు చేపట్టి ఆవుల అక్రమ రవాణా జరగకుండా విధులను నిర్వర్తిస్తున్నట్లు తెలియజేశారు.జిల్లాలో ఆకస్మిక తనిఖీలను నిర్వర్తిస్తూ అక్రమ రవాణ జరగకుండా కాపాడుతూ,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్టు తెలియజేశారు.బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పటిష్ట బందోబస్తుల ఏర్పాటు చేయడం .జరిగిందని తెలిపారు.సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు ఇతరుల మనోభావాలు దెబ్బతినే విధంగా అభ్యంతరకర పోస్టులు వచ్చిన ప్రజలు అట్టి పోస్టులను చూసిన వెంటనే ప్రతిస్పందించకుండా,సంయమనం పాటిస్తు అట్టి పోస్టుల్లో నిజానిజాలను తెలుసుకునే ప్రయత్నం చేయాలని,సామాజిక మాధ్యమంల్లో వచ్చే వదంతులను నమ్మవద్దని వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.సోషల్ మీడియాలో తప్పుడు వార్తలను పోస్ట్ చేసిన ఫార్వార్డ్ చేసిన వారితో పాటుగా గ్రూప్ అడ్మిన్లపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## మిషన్ భగీరథ పైపులైన్‌కు లీకేజీ

### * వృధాగా పోతున్న తాగునీరు



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** రాష్ట్రంలోని ప్రతి ఇంటికి మంచి నీటిని అందించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రారంభించింది. దీనికోసం వేల కోట్లు రూపాయలను వెచ్చించింది. ప్రజల కోసం ఇంత ఖర్చు చేసిన సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ప్రజాధనం వృధాగా మారుతుంది. నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడకుండా సర్కార్ పథకాలకు శ్రీకారం చుడుతుంటే క్షేత్రస్థాయిలో మాత్రం వీటి ఫలితాలు ఆశాజనకంగా లేకుండా పోతున్నాయి. ఇలాంటి ఘటనే తాజాగా తెలుగులోకి వచ్చింది. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో స్కూల్ సమీపంలో గత కొన్ని రోజులుగా మిషన్ భగీరథ పైపు పగిలి నీరు వృధాగా పోతున్న పట్టించుకునేవారు కరువయ్యారు. మిషన్ భగీరథ మెయిన్ పైప్ లైన్ పగిలి నీరు వృధా పోతూ సముద్రాన్ని తలపించేలా ఉవ్వెత్తున ఎగురుతూ సునామీని తలపించింది. కాలనీవాసులు పలుమార్లు సంబంధిత గ్రామ కార్యదర్శికి విషయం తెలుపగా పట్టించుకున్న పాపాన లేదు ఆ పని మాది కాదు సంబంధిత మిషన్ భగీరథ వాళ్ల పని అని తెలిపారని అన్నారు. రాష్ట్రంలో ఎండలు దంచి కొడుతున్నాయి. పలు ప్రాంతాల్లో భూగర్భ జల వనరులు పాతాళానికి పడిపోయాయి ఈ నేపథ్యంలో ప్రజల తాగునీటికి తీవ్ర కటకట ఏర్పడుతోంది. మరోవైపు వృధాగా పోతున్న నీటిని చూస్తూ ఉన్న వారే తప్ప దాన్ని వృధా పోకుండా ఆపేవారు లేకుండా పోయారు. ఇంతగా నీరు వృధా పోతున్న ఏ అధికారి మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో కాలనీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి నీటి లీకేజీని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. తాగునీటికి ఇబ్బందులు ఏర్పడకుండా చూడాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు.

## పొచ్చెరలో పెద్దమ్మతల్లి.. భీమన్న దేవుని పండగ

**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండలం పొచ్చెర గ్రామంలో ఆదివారం గ్రామ దేవతలకు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా పెద్దమ్మ తల్లికి, భీమన్న దేవునికి నైవేధ్యాలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు.ఈ సంవత్సరం పంటలు బాగా పండి పాడి పంటలతో గ్రామం అభివృద్ధి చెందాలని మొక్కులు చెల్లించుకున్నారు.

## నేడు విద్యుత్ ప్రజావాణి

**ప్రజా పక్షం / ఎండపల్లి :** జగిత్యాల జిల్లా ధర్మపురి సబ్ డివిజన్ పరిధిలో గల ధర్మపురి, నేరెళ్ళ, వెల్గటూర్, రాజారాంపల్లి సెక్షన్ కార్యాలయాలలో, అలాగే అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్, ధర్మపురి సబ్ డివిజన్ కార్యాలయంలో నేడు సోమవారం విద్యుత్ ప్రజావాణి కార్యక్రమము నిర్వహించడుతున్నట్లు అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఆఫీసర్ టీ. సింధు శర్మ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమసమస్యలు పరిష్కరించుకోవాల్సిందిగా కోరారు.

## ఎమ్మెల్యేను కలిసిన వైద్యాధికారి



**ప్రజాపక్షం / జగిత్యాల జిల్లా ప్రతినిధి :** జగిత్యాల జిల్లా నూతన డిఎంహెచ్‌వోగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సమియుద్దీన్ ఆదివారం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

## విద్యార్థినికి సన్మానం



**ప్రజాపక్షం / సారంగాపూర్ :** విలువలతో కూడిన విద్యను అందిపుచ్చుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జగిత్యాల జిల్లా మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు ఒడ్నాల రాజశేఖర్ అన్నారు. సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామానికి చెందిన చుక్క రాజేశంతిరుమల దంపతుల కుమార్తె అక్షర ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ విద్య కనబరిచి జిల్లా స్థాయిలో రాణించి 10/10 జిపిఎ సాధించగా, విద్యార్థిని అక్షరను ఆదివారం సన్మానించారు. సీనియర్ న్యాయవాది రాచకొండ శ్రీరాములు, నాయకులు కోలా శ్రీనివాస్, ఆకుల రాజారెడ్డి, బాధినేని లక్ష్మినారాయణ, తేలు రాజు, బండారి వెంకటేష్, బాధినేని వెంకటేష్, శంకర్, మాసర్తి తిరుపతి, సిగిరి రాజారెడ్డి, మరియు కుల సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపాల్ ఆత్మహత్య

**ప్రజాపక్షం/ మంచిర్యాల క్రైం :** మంచిర్యాల జిల్లా కేంద్రంలోని హమాలివాడకు చెందిన జంజిరాల స్నేహలతఅనేవివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. లక్షెట్టిపేటపట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్న స్నేహశీల ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. భర్త మహేష్ వేధింపులు భరించలేక స్నేహలత ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

# నా విజయం కార్యకర్తలే : ఎంపి నగేష్

**ప్రజాపక్షం/బోథ్ :** తన విజయ కార్యకర్తలే నని ఆదిలాబాద్ ఎంపి గోడం నగేష్ అన్నారు. ఆదివారం బోథ్ మండల కేంద్రంలోని సాయి ఫంక్షన్ హాలులో బిజెపి మండల శాఖ హాలులో విజయోత్సవఅభినందన సభలోఆయన పాల్గొన్నారు.ఎంపి సభను ఉద్దేశించి మాట్లాడుతూ తనది సుదీర్ఘ రాజకీయ జీవితమని 1994 నుంచి రాజకీయంలో ఉన్న ఘనత తనది అని అన్నారు. ఇప్పటి వరకు ఎన్నో అభివృద్ధి పనులు చేశానని ఇంకా చేసే అభివృద్ధి పనులు ఉన్నాయని అన్నారు.అలాగే బోథ్ మండలంలోని ప్రతి ఒక పల్లెకు రోడ్డు



సౌకర్యం కల్పించానని అన్నారు. అలాగే ప్రధాని నరేంద్ర మోడి సహకారంతో మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. అలాగే తన కోసం తన గెలుపు కోసం ప్రతి ఒక కార్యకర్త కష్ట పడ్డారని వారి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎంపిని సన్మానించారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు పతంగె బ్రహ్మానంద్, దక్షిణ మధ్య రైల్వే సభ్యుడు జివి రమణ, తాంసి జడ్పీటిసి రాజు,పిఎసిఎస్ చైర్మన్ ప్రశాంత్, మండల కన్వీనర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి రాజ్‌కుమార్‌కు అభినందన

**ప్రజాపక్షం / జగిత్యాల జిల్లా ప్రతినిధి :** ఎస్ఎస్సి పరీక్ష పేపర్ రీ వెరిఫికేషన్ లో సూర్య గ్లోబల్ స్కూల్ జగిత్యాల విద్యార్థికి మార్కులు పెరిగి 10 జీపీఏ సాధించారు. జగిత్యాల పట్టణంలోని సూర్య గ్లోబల్ స్కూల్ విద్యార్థి నవ్వ రాజ్ కుమార్ కు ఎస్ఎస్సి ఫలితాలలో సైన్స్ సబ్జెక్టులో 9 జిపిఏ రాగా ఆ విద్యార్థికి ఓవరాల్ గా 9.8 జీపీయే వచ్చింది. అయితే తాను పరీక్ష బాగానే రాశానని భావించిన విద్యార్థి రీ వెరిఫికేషన్ చేయించారు. దీంతో విద్యార్థి సైన్స్ పేపర్ ను రీ వెరిఫికేషన్ చేయాగా 1 మార్కు పెరిగింది. దీంతో విద్యార్థి 10జిపీఏ సాధించినట్లుగా మార్కుల మెమో ను ఎస్ఎస్సి బోర్డు ఆదివారం జారీ చేసింది. సూర్య గ్లోబల్ స్కూల్ విద్యార్థికి రి వెరిఫికేషన్ లో 10 జిపిరావడంతో విద్యార్థిని పాఠశాల కరస్పాండెంట్ బోయినిపెల్లి శ్రీధర్ రావు, డైరెక్టర్లు హరిచరణ్ రావు మౌనికరావు తదితరులు అభినందించారు.



## ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ



**ప్రజాపక్షం / గొల్లపల్లి :** నూతన విద్యా సంవత్సరం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతోపాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్నం భోజన వసతి అందుబాటులో ఉందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఈరవేణి రాజ్ కుమార్ అన్నారు. గొల్లపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు ఉచితంగా సరఫరా చేస్తున్న పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు, ఏకరూప దుస్తులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కుల సంధ్య తో కలిసి పని చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల లో చదివే విద్యార్థులందరికీ అన్ని రకాల సదుపాయాలను సమకూరుస్తుందని, ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులను వినియోగించుకొని పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరుకావాలని చదువు ద్వారా మాత్రమే తగిన గుర్తింపు లభిస్తుందని, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరాలంటే ఇప్పుడు బాగా చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రిన్సిపల్ ఈరవేణి రాజ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె. నగేష్, పాఠశాల గ్రంథాలయ బాధ్యులు హరిప్రియ, ఉపాధ్యాయులు సతీష్, మురళీధర్, అన్నపూర్ణ, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు రజిత విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపుల అభ్యున్నతే ధ్యేయం



**ప్రజాపక్షం / మల్లాపూర్ :** జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి కళ్యాణ మండపంలో ఆదివారం మండల మున్నూరు కాపు కులస్తుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం నూతన మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా మండల మున్నూరు కాపు సంఘ అధ్యక్షునిగా మండల కేంద్రానికి చెందిన ముత్యాల శంకర్, ప్రధాన కార్యదర్శిగా గజ్జి శ్రీనివాస్ సరికేల మహిపాల్, ఉపాధ్యక్షునిగా రాజేందర్, సహాయ కార్యదర్శిగా, కొక్కూ తిరుపతి, కార్యదర్శిగా దేవేందర్, కోశాధికారిగా గంగారెడ్డి, సలహాదారుడిగా కొప్పుల లక్ష్మ ణ్ లతో పాటు విద్య, వైద్య, స్పోర్ట్స్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు వోద్నల రాజశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు నియామక ఉత్తర్వులు అందజేసి అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మున్నూరు కాపుల బలోపేతానికి ప్రతి ఒక్కరం కృషి చేయాలని, అని రంగాల్లో మున్నూరు కాపులు రాణించి ఐక్యంగా ఉండాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద కుటుంబాలకు చెందిన మున్నూరు కాపులను ఆదుకునేలా నూతన కార్యవర్గ సభ్యులు తోడ్పాటు అందించాలని సూచించారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి నూతన మండల అధ్యక్షుడు శంకర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, విజయ్, సుధాకర్, చిరంజీవి, నరేష్, చంద్రశేఖర్, నారాయణ, శంకర్, మహేష్, నారాయణ, మోహన్, నాగరాజు, రమేష్, మున్నూరు కాపు కుల బాంధవులు ఉన్నారు

## విద్యాశాఖ మంత్రిని నియమించాలి

### బిసి యువజన సంఘంజిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్

**ప్రజాపక్షం/కరీంనగర్:** కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలని కరీంనగర్ బిసి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్, జాతీయ బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం పటేల్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్ జిల్లా బిసి సంఘం కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. విద్యాసంవత్సరం ప్రారంభమైన తరుణంలో ప్రభుత్వం విద్యాశాఖపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఖాళీగా ఉన్న విద్యాశాఖలో మంత్రిని ఎందుకు భర్తీ చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగానలో అత్యంత కీలకమైన విద్యాశాఖ మంత్రి లేకపోవడం బాధాకరమన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమైన తరుణంలో విధ్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు పడకుండా విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలలో తగిన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రైవేట్ స్కూల్, కాలేజీలలో అధిక పీజులు వసూలు చేస్తున్నయాజమాన్యాలు, కళాశాలలపై చర్యలు తీసుకోవాలని, ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, గుర్తింపు లేని స్కూల్, కాలేజీలనునడుపుతున్నవారినిశిక్షించాలన్నారు. బిసి సంక్షేమసంఘంజిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిగుర్ల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాటా వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు నల్లగోని శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా వన బోజనాలు



**ప్రజాపక్షం / ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని పెద్ద చెరువు కట్ట వద్ద పోచమ్మ ఆలయం, పెద్దమ్మ ఆలయాలు ఆదివారం వనభోజనాలతో సందడిగా మారాయి. ఈ సందర్భంగా ఆషాఢ మాసం ప్రారంభాన్ని సందర్శించుకుని పలు కుల సంఘాలైన నాయి బ్రహ్మణ సేవా సంఘం, ముదిరాజు సంఘం మహాలక్ష్మి వాడకట్టు మున్నూరు కాపు సంఘం, కుమ్మరి సంఘం, హరిజన సంఘాల సభ్యులు ఆయా సంఘ భవనాల వద్ద నుండి డప్పు చప్పుళ్లతో చల్లముంతలతో ఆలయాలకు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం ఆయా కుల సంఘాల సభ్యులు మహిళలు వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు పండాలని అమ్మవారిని వేడుకున్నారు. వనభోజనాలతో ఆయా కుల సంఘాలసభ్యులు మహిళలు చిన్నారులు పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న పశువుల లారీ పట్టివేత




**ప్రజాపక్షం/ బెజ్జూర్ :** అక్రమంగా తరలిస్తున్న పశువులను బెజ్జూర్ పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున బెజ్జూర్ పోలీసులకు అందిన పక్కా సమాచారం మేరకు ప్రధాన రహదారిపై తణిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో బెజ్జూర్ మండలం కుంటలమానేపల్లి లో అక్రమంగా లారీలో తరలిస్తున్న 36 పశువులను బెజ్జూర్ ఎస్ఐ విక్రమ్ పట్టుకున్నారు. వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేక పోవడంతో లారీలోని పశువులను పోలీస్ స్టేషన్ కు తరలించి ఒకరిపై కేసు నమోదు చేశారు. పశువుల అక్రమ రవాణా నేరం అని, పరిమితికి మించి పశువులను రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## బైక్ అదుపు తప్పి మహిళ మృతి

**ప్రజాపక్షం/ చింతలమానేపల్లి :** బైక్ అదుపు తప్పి కిందపడటంతో మహిళ మృతి చెందిన ఘటన కొమురం భీం జిల్లా బెజ్జూర్ లో చోటుచేసుకుంది. ఆదివారం చింతలమానేపల్లి మండలంలోని కర్జవెల్లి నుంచి సిద్ధపూర్‌లో ఉండే తన బిడ్డ ఇంటికి మనవడు మహేశ్ బైక్ పై బూస రామక్క(60) వెళ్తుండగా బారెగూడ, పోతపల్లి గ్రామాల మధ్య బైక్ అదుపు తప్పి ఆమె కిందపడింది. తీవ్రంగా గాయపడిన రామక్క అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

## ఘనంగా భీమన్న దేవుని పండుగ

**ప్రజాపక్షం/కుంటాలః** మండల కేంద్రంలోని నాయకపోడ్,ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భీమన్న దేవుని పండుగను ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రతి యేటా వర్షాకాలం ప్రారంభానికి ముందు మృగశిర కార్తే ప్రారంభమవ్వగానే పంటలకు అనుగుణంగా సరైన సమయంలో వర్షాలు కురిసి పాడిపంటలతో గ్రామాలు సస్యశ్యామలమవ్వాలని తమ కుటుంబాలు సుఖశాంతులు ఆయురారొగ్యాలతో విరసిల్లాలని కుటుంబీకులతో కలిసి భీమన్న పండుగను అత్యంతవైభవంగానిర్వహిస్తామని పేర్కొన్నారు. సంఘ పెద్దలు,పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## అభిలాష అభినవ్ బాధ్యతలు స్వీకరణ

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** నిర్మల్ జిల్లా నూతన కలెక్టర్ గా అభిలాష అభినవ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీలలో భాగంగా జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్‌గా విధుల నిర్వహిస్తున్న అభిలాష అభినవ్ కు నిర్మల్ జాల్లా కలెక్టర్ గా బదిలీ అయిన సందర్భంగా ఆదివారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్ లో కలెక్టర్ గా ఆమె బాధ్యతలు స్వీకరించారు.నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ ను ఆర్డీఓ,ఇతర జిల్లా అధికారులు,కలెక్టర్ కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

# కార్యకర్తలే నా బలం.. నా బలగం : అనిల్ జాదవ్

**ప్రజాపక్షం/నేరడిగొండః** బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ జన్నదిన సందర్భంగా మండల కేంద్రంలోని తన నివాసంలో పార్టీ కార్యకర్తల,అభిమానుల,నాయకులతో కోలహాలము మధ్య టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ .జాదవ్ జన్మదిన వేడుకలు జరిగాయి.ఈ కార్యక్రమానికి అదిలాబాద్ మాజీ మంత్రి జోగు రామన్న,బోథ్ నియోజకవర్గం నుండి 9 మండలాల,ప్రజలు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఒక పండగ వాతావరణంలా ప్రజల ప్రతినిధిగ రెండు దశాబ్దాల నుండి అలుపెరగని పోరటముతో జనంతో కలిసి ప్రతి



పక్ష పార్టీలతో ఎదురొడ్డిన ధీరత్వముతో,నేరడిగొండ మండలంలోని తండా ఆయన రాజురా గ్రామంలో జన్మించి,బోథ్ నియోజకవర్గ వ్యాప్తంగా పరివ్యాపించి,గ్రామ గ్రామన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన యువ కెరటమని రెండు దశాబ్దాల పాటు ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని,శ్రమించి,చెమటోర్చి చివరకు పెను తుఫానుని సైతం తట్టుకుని సగర్వంగా రెపరెపలాడిన మొక్కవోని కార్యకర్తల కష్ట ఫలితంగా సాధించిన విజయం అని అన్నరు.మండల టిఆర్ఎస్ నాయకులు,ఎంపీపీ రాథోడ్ సజన్,సురేందర్రాథోడ్,పందరి,రవీందర్ రెడ్డి,బోథ్ నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున అభిమానులు పార్టీ కర్యాకర్తలుపాల్గొన్నారు.

# నిందితుడ్ని కఠినంగా శిక్షించాలి

**ప్రజాపక్షం/ముత్తారం :** చిన్నారి సహస్రను చిదిమేసిన కామాంధుడి ని కఠినంగా జీవించాలని మాజీ సర్పంచ్ సంపత్‌రావుడిమాండ్ఆదివారంపెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని హరిపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి చిన్నారి సహస్రకు కృపత్ర ర్యాలీ నిర్వహించి ఘనంగా మీ వల్ల అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ..యావత్ మానవ సమాజం తలదించుకునే విధంగా జరిగినటువంటి ఘోరమైన చర్య మన తెలంగాణ లోని పెద్దపల్లి జిల్లాలోని సుల్తానాబాద్ కాట్నపల్లి గ్రామం లో జరగడం చాలా దురదృష్టకరం పసి కూన పై కామ వాంఛతో ఒక కిరాతకుడు జరిపినటువంటి అమానవీయ చర్యకు ఆ పసికందు తన ప్రాణాలు కోల్పోయిందని. అప్పుడే ఆడుకుని తన తల్లి చేతితో గోరుముద్దలు తిని తన తల్లి పక్కనే పడుకున్నటువంటి ఆ చిన్న పిల్లని ఒక కామాంధుడు ఎత్తుకెళ్లి ఆ పాపపై అత్యాచారం చేసి ఆ పిదప చంపి వేసిన ఘటన అందరిని కలిసివేసిందని మాజీ సర్పంచ్ సంపత్ రావు ఆవేదన వ్యక్తం చేశారు.ఇటువంటి దుర్మార్గుడిపై దయా దాక్షిణ్యాలు చూపకుండా వెంటనే తెలంగాణ ప్రభుత్వం కఠినమైన శిక్షలు పడేలా చూడాలని సంపత్ రావు డిమాండ్ చేశారు.ఆ తల్లిదండ్రుల ఆవేదన ఆ పాపను తీసుకొస్తే గాని తీరనిది, ఆ పాప ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అంతేగాక మాజీ సర్పంచ్ సంపత్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో పాల్గొని ప్రభుత్వ ర్యాలీ నిర్వహించి పాపకు నివాళులర్పించడం జరిగింది.

# సురక్షిత నీరందించేందుకు సర్వే

**ప్రజాపక్షం/ముత్తారం :** ప్రజలకు సురక్షితమైన నీరు అందించేందుకే మిషన్ భగీరథ సర్వే చేపడుతున్నట్లు దీనికి ప్రతి గ్రామపంచాయతీ కార్యదర్శులు, వివోలు, అంగన్వాడి కార్యకర్తలతో పాటు వివిధ శాఖల వారు సహకరించి సర్వే పూర్తి చేయాలని ఎంపీడీవో లలిత పేర్కొన్నారు. శనివారం ముత్తారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఐకెపి ఎపిఎం, ఏపీవో, గ్రామపంచాయతీ కార్యదర్శులు, వివోలు, అంగన్వాడి కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో లలిత మాట్లాడుతూ ముత్తారం మండల పరిధిలోని ప్రతి ఇంటింటికి సురక్షితమైన నీరు అందించేందుకే మిషన్ భగీరథ సర్వే చేపడుతున్నామని అన్నారు. ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ నీరు అందించేందుకు సర్వే చేపడుతున్నామని, సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. సర్వే సిబ్బంది వివరాలను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో గ్రామపంచాయతీ కార్యదర్శులు వర్షాకాలం వస్తున్నందున మురికి కాలువలు, డ్రైనేజీలను శుభ్రం చేయాలని, నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రజలందరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలోగ్రామపంచాయతీ కార్యదర్శులు, వివోలు, అంగన్వాడీ కార్యకర్తలు తో పాటు వివిధ శాఖల వారు పాల్గొన్నారు.

## యువతకు క్రికెట్ కిట్లు పంపిణీ

**ప్రజాపక్షం/ బెల్లంపల్లి :** యువత చెడు మార్గంలో పయనించకుండా మం చి మార్గంలో వెళ్లి ఉన్నత చదువులు చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని బెల్లంపల్లి సిఐ రవికుమార్ అన్నారు. ఆదివారం కాసిపేట పోలీస్ ఆధ్వర్యంలో యువకులకు క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తుకు కేంద్ర బిందువు యువత అని,యువత తలుచుకుంటే ఎన్నో విజయాలను సునాయాసంగా అందుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు అని, అంతటి శక్తి కేవలం యువతలోనే ఉంది అని అన్నారు. క్రీడలు ఆడడంతో శరీరానికి వ్యాయామంఅవుతుందని, విద్యార్థులు యువకులు చెడు అలవాట్లకు బానిస కాకుండా ఉదయం వ్యాయామం చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. యువకులు, గంజాయి, జూదం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టి ఉద్యోగాలు సంపాదించి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరించినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

# కనీస హక్కులు కల్పించాలని డిమాండ్

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు,అధ్యాపకులు, వ్యాయామఉపాధ్యాయులకు,బోధనేతర (నాన్ టీచింగ్) సిబ్బందికి కనీస హక్కులు అమలయ్యేలా చూడవలసిన బాధ్యత ప్రభుత్వం పై ఉంటుందని తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ గుమ్మడి కొమురయ్య అన్నారు. జిల్లా కేంద్రం లో ప్రయివేటు ఉపాధ్యాయుల సమస్యలపై ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాలయాల యజమానులు తమ అభ్యున్నతికి తోడ్పడుతున్న ఉపాధ్యాయులకు,అధ్యాపకుల కు,వ్యాయామ ఉపాధ్యాయులు,బోధనేతర (నాన్ టీచింగ్) సిబ్బందికి శ్రమకు తగిన విధంగా నెలకు 25000 రూపాయలకు తక్కువ కాకుండా వేతనాలు చెల్లించాలి అన్నారు.పని చేసిన పది నెలలకే కాకుండా 12 నెలల వేతనం చెల్లించాలని అన్నారు.ప్రతి నెల ఒక సెలవు మాత్రమే ఇస్తున్నారని రెండు అమలు చేయాలని,అదనపు సమయం పనిచేయించుకుంటే గంటకు వంద రూపాయలు అదనంగా చెల్లించాలి అన్నారు. ప్రైవేట్ ఉపాధ్యాయులకు కూడా ప్రోవిడెంట్ ఫండ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని అన్నారు.ఆకస్మికంగా మరణించిన ప్రైవేట్ ఉపాధ్యాయులకు ఎక్సగ్రేషియా చెల్లించాలని, వార్షిక వేతనాభివృద్ధి 15 శాతం ఉండాలి అన్నారు.వారికి కూడా నెల మొదటి తేదీనే వేతనాలు చెల్లించాలి అన్నారు.సెలవు దినాలలో ప్రైవేట్ తరగతులు నిర్వహిస్తే రోజుకు 1000 రూపాయలు చెల్లించాలని అన్నారు.శ్రమ దోపిడీకి గురి అవుతున్న ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు,అధ్యాపకుల పక్షాన ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా కో కన్వీనర్ గాండ్ల మల్లేశం పాల్గొన్నారు.

## మంత్రులను కలిసిన కలెక్టర్



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుదిళ్ళ శ్రీధర్ బాబు, రాష్ట్ర పంచాయితీ రాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) లను స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పుష్ప గుచ్చం అందించారు.

## నిర్ణీత సమయంలో హాజరు కావాలి




**ప్రజాపక్షం/ రామగిరి :** అంతర్గత ఇ.పి ఆపరేటర్ల ట్రైనింగ్ ప్రాక్టికల్ పరీక్షలను అత్యంత పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని, అభ్యర్థులు నిర్ణీత సమయం లో హాజరు కావాలనీ రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.సుధాకర రావు ఒక ప్రకటన ద్వారా తెలిపారు.రామగుండం3 ఏరియా సెంటినరీ కాలనీ లోని రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణము నందు ఈనెల 18 నుండి 20 వరకు జరిగే ఇ . పి ఆపరేటర్ల ప్రాక్టికల్ పరీక్షలు పారదర్శకంగాను,ఎటువంటి అవకతవకాలకు ఆస్కారం లేకుండా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అభ్యర్థులు నిర్ణీత సమయంలో హాజరుకావాలని, ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా పరీక్షలకు హాజరుకావాలని తెలియజేశారు. ప్రాక్టికల్ పరీక్షలు మొదలవుతాయని తెలియజేశారు.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/రామగిరి :** ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి వెళ్లి సమస్యలు పరిష్కరించాలని పెద్దపల్లి జిల్లా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తూము రవీందర్ పటేల్ అన్నారు. ఆదివారం హైదరాబాదులోని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు సత్యనారాయణ ఆధ్వర్యంలో రాష్ట్ర ఈసీ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో పెద్దపల్లి జిల్లా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు తూము రవీందర్ మాట్లాడుతూ ప్రతి జిల్లాలో సభ్యత్వం పూర్తి స్థాయిలో చెయ్యాలని సంఘం ఐక్యతకు కృషి చెయ్యాలని ఉద్యోగుల అధికారుల సమస్యలు రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఉద్యోగుల ఎన్నికలు మరియు జనరల్ ట్రాన్స్ఫర్స్ చెయ్యాలని ప్రతి జిల్లాలో TGOs' అసోసియేషన్ బిల్డింగ్ నిర్మాణం కొరకు ప్రభుత్వ భూమి కేటాయించేలా జిల్లా కలెక్టర్స్ కు ఆదేశాలు ఇప్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు , అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, ఫోరమ్స్ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

# మండల టాపర్‌ని అభినందించిన మంత్రి



**ప్రజాపక్షం/చిగురుమామిడి :** పదోతరగతిలో మండల వ్యాప్తంగా 10 జిపిఏ సాధించిన ఏకైక విధ్యార్థిని దాసరి సిరివైష్ణవ్య స్వగృహానికి రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెళ్లి పూల బొకే అందించి శాలువాతో సత్కరించారు. మంత్రితో పాటు కరీంనగర్ రూరల్ ఏసిపి వెంకటరమణ, తిమ్మాపూర్ సిఐ స్వామి, చిగురుమామిడి ఎస్ఐ రాజేష్, జడ్పిటిసి గీకురు రవీందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి పాల్గొన్నారు. స్వగృహానికి వచ్చి సత్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు డిసిసి అధికార ప్రతినిధి దాసరి ప్రవీణ్ కుమార్ నేత కృతజ్ఞతలు తెలిపారు.

# న్యాయవాదికి తెలంగాణ స్ఫూర్తి అవార్డు ప్రదానం

**ప్రజా పక్షం/ ఇచ్చోడ :** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురష్క రించుకుని దశాబ్ధి ఉత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని అడెగామ(కే)గ్రామానికి చెందిన న్యాయవాది సంగెం సుదీర్ కుమార్ కు ఆదివారం తెలంగాణ స్ఫూర్తి అవార్డును ప్రధానం చేశారు. మలి దశ ఉద్యమంలో పాలుపంచుకున్న కవులు, కళాకారులు, న్యాయవాదులు, ఉద్యమకారులను హైదరాబాద్‌లోని త్యాగరాయగానసభలో సన్మాన సభను ఏర్పాటు చేశారు. ఎంఎల్సీ మహేశ్ గౌడ్, బీసీ కమిషన్ ఛైర్మన్ కృష్ణ మోహన్, సత్య సంగీత ఇంటర్నేషనల్ అధ్యక్షులు ఓంకార్ రాజు చేతుల మీదు గా న్యాయవాదికి అవార్డును ప్రధానం చేశారు. మలి దశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కళాకారులు, కవులు, న్యాయ వాదులు, ఉద్య మ కారుల పాత్ర కీలకమని ఎంఎల్సీ మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా న్యాయవాదికి ఈ అవార్డు రావడం పట్ల జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ తారలు శైల జ, శైలిమ, ఊర్వశి తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతుల కరపత్రం ఆవిష్కరణ



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ఈ నెల 18,19,20వ తేదీలలో దళిత హక్కుల పోరాట సమితి ఆద్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట లక్ష్మి నరసింహస్వామి ఫంక్షన్ హాలులో తలపెట్టిన మూడు రోజుల రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు గంగిపల్లి శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని తిరుపతిలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా నుంచి ఇచ్చిన కోటా ప్రకారం 20 మంది డెలిగేట్స్‌తో యాదగిరిగుట్టకు శిక్షణ తరగతులకు హాజరు కావాలని తెలపడం జరిగిందన్నారు. తరతరాలుగా అణచివేత, అంటరానితనం, వివక్ష, దోపిడీ పీడనాల కింద నలిగిపోతున్న అట్టడుగు వర్గాలైన అశేష శ్రామిక కులాల అభ్యున్నతి లక్ష్యంగా దళిత హక్కుల పోరాట సమితి ఆవిర్భవించిందన్నారు. దారుణంగా బలైపోతున్న దళితులను సామాజిక ఆర్థిక రాజకీయ ఆధిపత్యాన్ని ప్రశ్నించి అణచివేతలను ఎదిరించి సమానత్వాన్ని సాధించేందుకు సంఘటితంగా చైతన్యం చేయుటకు ప్రధాన లక్ష్యంతో దళిత సామాజిక దృక్పదంతో తెలంగాణ రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరై దళిత అభివృద్ధికి తోడ్పడే విధంగా సూచనలు విని భవిష్యత్ తరాలకు కొరకై పాటుపడదామని తెలిపారు. కార్యక్రమంలో దాసరి వేణు, అలవాల శంకర్ , గోపి మల్లేశం, యుగేందర్, కాత లక్ష్మి రాజం, మహేష్, శంకర్, దళిత సంఘం నాయకులున్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్ధుల ఆత్మీయ సమ్మేళనం



**ప్రజాపక్షం/పెగడపల్లి :** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని ఐతిపల్లి జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ బాలబాలికల ప్రభుత్వ పాఠశాల 1991/1992 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 32 ఏళ్ల అనంతరం 42 మంది పూర్వ విధ్యార్థులు, ముగ్గురు ఉపాధ్యాయులు తిరిగి ఒకే వేదికపై కలిశారు. ఆత్మీయ పలకరింపులు, యోగక్షేమాలతో సమావేశం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. వివిధ రంగాల్లో ఎక్కడెక్కడో స్థిరపడి సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారందరూ ఒకే చోట చేరడంతో వారి ఆనందానికి అవదులు లేకుండా పోయాయి. అనంతరం సరదాగా ఆటపాటలతో నృత్యాలతో హోరెత్తించారు. ఉపాధ్యాయులు నరసింహ చారి, లక్ష్మి నారాయణ, మనోహర్‌రావు పాల్గొనగా పూర్వ విధ్యార్థులు తిరుపతి గౌడ్, గంగ మల్లేశం, లక్ష్మి నారాయణ, శ్రీనివాసరెడ్డి, మధుసూధన్, ప్రసాద్, మాధవి, కవిత, మంజుల, వనజ, నాగ సముద్రం కుమారస్వామి, కలికోట వేణుగోపాలచారి, రాంరెడ్డి, అశోక్ రెడ్డి, దామోదర్, రావేశం సాగర్, కనకయ్య, మధుసూధన్, గణేష్, రామిరెడ్డి తదితరులున్నారు.

# 30న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్, వాచ్మెన్, స్వీపర్స్ జనరల్ బాడీ సమావేశం

## సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పున్నం రవి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** ఈ నెల 30న ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు, వాచ్మెన్, స్వీపర్స్ జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పున్నం రవి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ముకుంద లాల్ మిశ్రాభవన్ (సిఐటియు) జిల్లా కార్యాలయంలో కరీంనగర్ జిల్లా ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు, ఆలైడ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా కమిటీ సమావేశం అధ్యక్షుడు కామాద్రి ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి, యూనియన్ గౌరవ అధ్యక్షుడు పున్నం రవి హాజరై మాట్లాడారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సెక్యూరిటీ సర్వీసెస్ ఏజెన్సీల వద్ద, డీమార్ట్, వాల్‌మార్ట్, వాణిజ్య సముదాయాలు, కార్పోరేట్ హాస్పిటల్స్, అపార్ట్‌మెంట్‌లు, విద్యాసంస్థలు, కాలేజీలు, బ్యాంకులు, ఏటిఎంల వద్ద పనిచేసే సెక్యూరిటీ గార్డ్స్, వాచ్‌మెన్, స్వీపర్స్ హాజరు కావాలని కోరారు. ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీలు ఈ కార్మికులను బానిసలుగా పనిచేయించుకుంటూ లాభాలు గడిస్తున్నాయని, ఈ సంస్థలను నియంత్రించి కార్మికులకు తగిన రక్షణ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం 2005లో తెచ్చిన ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ (రెగ్యులేషన్) యాక్ట్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సక్రమంగా అమలు చేయడం లేదని విమర్శించారు. కనీస వేతనాలను పెరిగిన ధరలకనుగుణంగా సవరించకుండా ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్స్ వాచ్‌మెన స్వీపర్స్‌కు ఏడు వేల నుంచి పది వేల జీతాలు ఇస్తూ శ్రమను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు పెంచాలని కోరితే తొలగిస్తున్నారని పోటీ కార్మికులను పనిలో పెట్టుకుని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెక్యూరిటీ సిబ్బందికి పిఎస్ఆర్ యాక్ట్ 2005 ప్రకారం అపాయింట్‌మెంట్ లెటర్, ఆర్డర్స్, ఐడి కార్డులు, యూనిఫామ్ యజమానులు ఇవ్వాలని, కనీస వేతనాలు పిఎఫ్, ఈఎస్ఐ, బోనస్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఉట్ల ప్రభాకర్, ఉపాధ్యక్షులు గున్నాల మల్లేశం, పుష్ప లచ్చ భాస్కర్, సహాయ కార్యదర్శిలు తాళ్ల కుమార్, నోముల జగన్ తదితరులున్నారు.

# ఉర్సు ఉత్సవాలకు ముస్తాబైన బిజిగిరి షరీఫ్ దర్గా

## వేలాదిగా తరలిరానున్న హజ్రత్ సయ్యద్ ఇంకుషావళి భక్తులు



**ప్రజాపక్షం/జమ్మికుంట :** జమ్మికుంట మండలం బిజిగిరి షరీఫ్ గ్రామంలోని ప్రముఖ ముస్లిం పుణ్యక్షేత్రం హజ్రత్ సయ్యద్ ఇంకుషావళి రహ్మాతుల్లాహు అలై దర్గా ఉర్సు ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయి. వందల ఏళ్ల నుంచి కులమతాలకతీతంగా సర్వమతాలకు వేదికగా కుల, మత, వర్గ, సామాజిక వైషమ్యాలకు అతీతంగా జరిగే ఉర్సు ఉత్సవాలకు వేదికగా నిలుస్తుంది. బిజిగిరి షరీఫ్ ఉర్సు ఉత్సవాలు బక్రీద్ పండుగ అయిన 17 వ తేదీ నుంచి 19 వరకు కొనసాగే ఈ ఉత్సవాల్లో వేలాది మంది భక్తులు హజ్రత్ సయ్యద్ ఇంకుషావళి దర్గాను దర్శించుకుంటారు. తమ కష్టాలు తొలగిపోవాలని కోరికలు నెరవేరాలని వేడుకుంటారు. వివిధ జిల్లాల నుంచే కాక మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు ఉర్సు ఉత్సవాలకు హాజరవుతారు.

### దర్గా ప్రాశస్త్యం

తెలంగాణలో అత్యంత ప్రముఖ పుణ్యక్షేత్రం బిజిగిరి షరీఫ్ దర్గాను 11వ శతాబ్దంలో నిర్మించారు. సుమారు 864 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర ఉన్న దర్గాలో హజ్రత్ సయ్యద్ ఇంకుషావళి రహ్మాతుల్లాహు అలైతో పాటు ఆయన సోదరుడైన ముర్తుజాషావళి, హజ్రత్ సయ్యద్ అక్బర్ షావలి సమాధులున్నాయి. జమ్మికుంట పట్టణానికి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో విశాలమైన గుట్టలు, ప్రకృతి రమణీయత ఆహ్లాదకరమైన వాతావరణానికి అనుసంధానమై చారిత్రక ఆధ్యాత్మిక ప్రాశస్త్రం గల ఈ దర్గా ఉంది. ఇస్లాంతో పాటు అల్లాహ్ సందేశాన్ని దివ్య ఖురాన్లోని సూక్తులను ప్రజలు తెలియజేస్తూ మధ్యయుగా కాలంలో అరబ్బుదేశం నుంచి వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ మానవత్వమే మతం అని విశ్వమానవ సమానత్వాన్ని చాటుతూ బిజిగిరి షరీఫ్ చేరుకుని దర్గాను నిర్మించుకున్న హజ్రత్ సయ్యద్ ఇంకుషావళి తన జీవిత కాలంలో ప్రదర్శించిన మహిమలు, బాధితుల పట్ల చూపిన కరుణ దయ వల్ల ఎందరో ప్రజలు సుఖ శాంతులతో జీవనం గడిపారు. హజ్రత్ సయ్యద్ ఇంకుషావళి వర్ధంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా జిల్ హజ్ మాసంలో 17వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఉర్సు ఉత్సవాలు జరుగుతాయి. నిష్టలతో వేడుకునే భక్తుల కోరికలను హజ్రత్ సయ్యద్ ఇంకుషావళి తీర్చుతారని ప్రసిద్ధి. ఉర్సు ఉత్సవాల సంధర్భంగా భక్తుల కోసం అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దర్గా ముతవల్లి మహమ్మద్ అక్బర్ అలీ, దర్గా ముతవల్లి కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ ఇక్బాల్, దర్గా కమిటీ ఉపాధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్ కరీం, కార్యనిర్వహణ అధ్యక్షుడు మొహమ్మద్ తౌఫిక్ హుస్సేన్, కార్యదర్శి మహమ్మద్ జమాల్ అష్రఫ్, సంయుక్త కార్యదర్శి మహమ్మద్ నయీమొద్దీన్, షా హుస్సేన్, సభ్యులు అహ్మద్, లతీఫ హుస్సేన్, ఆజమ్, జలీల్, తాజ్ తదితరులు పేర్కొన్నారు. ఈ ఉత్సవాలకు తెలంగాణ రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, జడ్పి చైర్మన్ కనుమల్ల విజయ, హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి వొడితెల ప్రణవ్ , జమ్మికుంట తహసీల్దార్ విజయ, జమ్మికుంట జడ్పిటిసి శ్రీరామ్ శ్యామ్, ఎంపిపి దొడ్డె మమత, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు తదితరులు హాజరుకానున్నారని నిర్వాహకులు తెలిపారు.

# కరీంనగర్ సిపికి కొత్తజయపాల్‌రెడ్డి బహిరంగ లేఖ

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతికి మైత్రి గ్రూప్ అధినేత కొత్త జయపాల్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. గత కొద్ది నెలలుగా విదేశాల్లో ఉన్న ఆయన తనపై జరుగుతున్న ప్రచారంతో పాటు కేసులు నమోదు చేస్తున్న తీరుపై ఈ లేఖలో ప్రస్తావించారు. ఈఓడబ్ల్యూలో ఓ డిఎస్పి స్థాయి అధికారికి హుస్నాబాద్‌లో పనిచేస్తున్న ఏసిపి స్థాయి అధికారికి సాన్నిహిత్యం ఉందని, హుస్నాబాద్ లోని అధికారి తనపై తప్పుడు సమాచారం ఇస్తున్నారంటూ ఆరోపించారు. ఇప్పటి వరకు నమోదు చేసిన కేసుల్లో ప్రభుత్వ అధికార యంత్రాంగం భాగస్వామ్యం ఉన్నప్పటికీ ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోలేదన్నారు. ఈఓడబ్ల్యూలో పనిచేస్తున్న అధికారులు చెప్పిందే నిజమని సిపి నమ్ముతున్నారని జైపాల్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. తనపై కక్ష కట్టి తప్పుడు కేసులు నమోదు చేసినట్లయితే తాను కోర్టులో న్యాయ పోరాటం చేస్తానని వెల్లడించారు. అయితే తప్పుడు కేసుల్లో ఇరికించే ప్రయత్నం గతంలోనూ జరిగిందని, ఇప్పుడు అలాగే జరుగుతోందన్నారు. తనపై కేసు నమోదు కాకముందే విదేశాలకు వెళ్తే కేసు నమోదు అయిన విషయం తెలిసి విదేశాలకు వెళ్లానని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. తాను ఎప్పుడు విదేశాలకు వెళ్లింది అన్న విషయం పాస్‌పోర్టులో ఉంటుందన్నారు. తనపై వస్తున్న ఆరోపణల నేపధ్యంలో ఈఓడబ్ల్యూలో పనిచేస్తున్న అధికారులే కాకుండా ఇతర అధికారుల ద్వారా విచారణ జరిపించేందుకు నిజనిర్ధారణ కమిటీ వేయాలని జైపాల్ రెడ్డి కోరారు.

